క్లుప్తంగా

నేడు గుండుగొలనులో వాసుబాబు పర్యటన

భీమడోలు: గుండుగొలనులోని సచివాలయం 2 పరిధిలో ఈనెల 10వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్, గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, గుండుగొలను ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

అమృత వాహిని అన్నదాన వాహనం ప్రారంభం


అమృత వాహిని అన్నదాన వాహనాన్ని ప్రారంభిస్తున్న తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామంజనేయచౌదరి

పెదపాడు: పేదలకు మేలు జరిగే ప్రతి కార్యక్రమానికి తపన ఫౌండేషన్ తన వంతు సహకారం అందిస్తుందని వ్యవస్థాపకుడు గారపాటి సీతారామంజనేయ చౌదరి అన్నారు. ఆదివారం ఏలూరు జిల్లా పెదపాడు మండలంలోని అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద మమతల పందిరి ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో తపన ఫౌండేషన్ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన అమృత వాహిని అన్నదాన వాహనాన్ని గారపాటి సీతారామంజనేయ చౌదరి ప్రారంభించారు. వివిధ శుభ కార్యాలయాల్లో, వివిధ ఫంక్షన్ల వద్ద మిగిలిన ఆహార పదార్థాలు సేకరించి పేదలకు పంపిణీ చేయడం కోసం ఈ వాహనాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మమతల పందిరి ఎఫ్‌బీ గ్రూపు వ్యవస్థాపకుడు లంక రమేష్, కడియాల విజయలక్ష్మి, ఎనమదుల రమేష్, బొత్సశేఖర్ చక్రధర్ వడ్డి వాసవి పాల్గొన్నారు.

నేడు కొక్కిరపాడులో 'గడపగడపకూ'

పెదపాడు: మండలంలోని కొక్కిరపాడులో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ అప్పనప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలును వివరించి ప్రజల సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు. ఈకార్యక్రమంలో మండలంలోని కార్యకర్తలు అభిమానులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

11న విగ్రహాల ఆవిష్కరణ

ఏలూరు (టూటౌన్) : ఈ నెల 11న ఉదయం 10 గంటలకు మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిభాయి పూలే విగ్రహాలను స్థానిక జ్యూట్ మిల్లు సెంటర్‌లో ఆవిష్కరించనున్నట్లు బీసీ కులాల జేఏసీ ఒక ప్రకటనలో తెలియజేసింది. బీసీ సోదరులు, ఉద్యోగుల సహకారంతో ఏర్పాటు చేయనున్న ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ కోటగిరి శ్రీధర్, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ పలువురు బీసీ నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు.

వృద్ధులకు చీరల పంపిణీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : సమాజంలో ఆపదలో ఉన్నవారికి, పేదలకు, వృద్ధులకు ప్రతి ఒక్కరూ తమకు తోచిన సహాయం చేయడం ద్వారా మానసిక సంతృప్తిని మూటగట్టుకోవచ్చని నగరానికి చెందిన సాయి సేవా సంస్థ అధ్యక్షుడు మిరియాల శేఖర్ బాబు తెలిపారు. ఆదివారం స్థానిక కొమడవోలు హమాలీ కాలనీలో ఉన్న మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సీహెచ్ స్వామి, మరియమ్మ దంపతుల సహకారంతో పేద వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేసి అనంతరం భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ వికలాంగులు, నిరుపేద కుటుంబాలకు సహాయం చేయడం ద్వారా కలిగే సంతృప్తి వర్ణనాతీతమన్నారు.

సొంతింటి కల.. నెరవేరుతున్న వేళ

- 14న అంబేడ్కర్ జయంతికి భారీగా గృహ ప్రవేశాలు
- జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం
- ఎమ్మెల్యే వాసుబాబు ప్రత్యేక దృష్టి
- నియోజకవర్గంలో 3,500 గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు


గుండుగొలనులో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇల్లు


గుండుగొలనులో ఆధునిక కాలనీగా మారిన జగనన్న భారీ లేఅవుట్

భీమడోలు: నవరత్నాలు.. అందరికీ ఇళ్ల పథకంలో పేదల సొంతింటి కల సాకారమవుతోంది. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లక్షలాది మందికి ఇళ్ల స్థలాలిచ్చి జగనన్న హౌసింగ్ కాలనీలుగా లేఅవుట్లను తీర్చిదిద్దింది. దీనితో కాలనీల్లో ఆధునిక లోగిళ్లు అవరించబోతున్నాయి. నాలుగు దశాబ్దాలుగా కట్టుకునేందుకు సెంటు జాగా, ఆర్థిక స్తోమత లేక అద్దె ఇంట్లో కాలం వెళ్లదీస్తున్న పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన వనరులను అందించి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకున్నారు. లబ్ధిదారులకు రూ.1.8లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది. పావలా వడ్డీకి రూ.35 వేలను బ్యాంకు రుణం అదనంగా అందిస్తున్నారు. దీనితో ఒకొక్క లబ్ధిదారుడికి రూ.2.15లక్షల వరకు సాయం అందుతోంది. ఏప్రిల్ 14న భారీ ఎత్తున జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలు చేయాలన్న లక్ష్యంతో సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేసారు.

మౌలిక వసతుల కల్పనకు పెదపీట

గ్రామాల్లో కోట్లాది రూపాయలతో ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసిన ప్రభుత్వం వాటిని మెరక చేసి పేదలైన అక్కాచెల్లెమ్మల పేరుతో అందించింది. మండలంలో గుండుగొలను, అంబర్‌పేట, పోలసానిపల్లి, పూళ్లలో 38.5 ఎకరాల భూమిని రూ.17 కోట్లతో ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఆ స్థలాలను మెరక చేసి చదును చేసి ఇళ్లు నిర్మించేందుకు అనువుగా సిద్ధం చేసింది. పారదర్శక విధానంలో డ్రా తీసి పట్టాల పంపిణీ చేసి మహిళల పేరుతో పట్టాలను అందజేసారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్న సంకల్పంతో ప్రభుత్వం గ్రావెల్ రోడ్లు, వీధిదీపాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, బోర్లు వేసి మంచినీరు తదితర కనీస వసతులను నుంచి కోట్లు వెచ్చించి సమకూర్చారు.

ఉంగుటూరు నియోజకవర్గం ప్రథమ స్థానం

ఏలూరు జిల్లాలో ఉంగుటూరు నియోజకవర్గం ఇళ్ల నిర్మాణంలో ప్రథమస్థానంలో ఉంది. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రతిష్ఠాత్మకంగా భావించి ప్రతి గ్రామంలో ఇళ్లు నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఎప్పటికప్పుడు ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందిస్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకుంటున్నారు. ఇంకా ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులతో ప్రతి శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించి వారిని చైతన్యపర్చుతున్నారు. నియోజకవర్గంలో 7,550 ఇళ్లు నిర్మిస్తున్నారు. గృహ ప్రవేశాలు చేసేందుకు 3,500 గృహాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.70కోట్ల వరకు బిల్లుల నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసారు.

ఉంగుటూరు నియోజకవర్గంలో

మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయిన ఇళ్లు
భీమడోలు	2,231	924
ఉంగుటూరు	2,664	1,369
నిడమర్రు	909	442
గణపవరం	1,746	765

ఉత్సాహంగా లబ్ధిదారులు

ఇళ్లు నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకతో పాటు ఐరన్, సిమెంట్ బస్తాలు, కిటికీ, తలుపుల ఫ్రేమ్స్‌లు, ఎలక్ట్రికల్ సామగ్రిని రాయితీపై అందిస్తోంది. దీని ద్వారా ఒకొక్క లబ్ధిదారుడికి రూ.30 వేల నుంచి రూ.40వేలు ఆదా అవుతుంది. బహిరంగ మార్కెట్‌లో ఇసుక బస్తా రూ.330కు పైగా ఉండగా ప్రభుత్వం రూ.260కు, టన్ను ఐరన్ మార్కెట్‌లో రూ.73వేలు ఉండగా రూ.63వేలకు అందిస్తోంది. ప్రతి ఇంటికి 90 బస్తాల సిమెంట్‌ను, రూ.17వేల విలువైన 20 టన్నుల ఇసుకను ఉచితంగా అందిస్తోంది. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారుల ఖాతాల్లో హౌసింగ్ శాఖ పర్యవేక్షణలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎంబుక్ చేసి వారికి నగదును జమ చేస్తున్నారు.

1,369 గృహ ప్రవేశాలు లక్ష్యం



గృహ లబ్ధిదారులను చైతన్యపర్చి గృహ నిర్మాణాలు వేగంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి నాటికి మండలంలో 1,369 మంది గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వం కాలనీల్లో మౌలిక వసతులను కల్పిస్తోంది. ప్రతి రోజు మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, తహసీల్దార్లు ప్రతి గ్రామాన్ని సందర్శించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. – సీహెచ్ సతీష్, ఏఈ, హౌసింగ్ శాఖ, భీమడోలు

రూ.కోట్లతో భూముల కొనుగోలు



మండల వ్యాప్తంగా ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిన భూములను కొనుగోలు చేసింది. గుండుగొలను, భీమడోలు, పోలసానిపల్లి, పూళ్లలో 38.84 ఎకరాలను రూ.17కోట్లతో కొనుగోలు చేసి లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాం. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు గృహ నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధను కనబర్చుతున్నారు. మండలంలో ఎక్కువ సంఖ్యలో గృహ ప్రవేశాలు జరిగేలా లబ్ధిదారులను చైతన్యపర్చుతున్నాం. – షంషుద్దీన్, తహసీల్దార్, భీమడోలు

అర్హులందరికీ ఇళ్లు



పేదలకు సొంతగూడును కల్పిస్తున్న నవరత్నాలు అందరికీ ఇళ్లు బృహత్తర పథకంగా నిలిచింది. గత టీడీపీ పాలనలో ప్రజలకు ఒక్క సెంటు భూమి ఇచ్చిన ఆనవాళ్లే లేవు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ స్థలం కేటాయించి ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చారు. నియోజవర్గంలో సుమారు 3వేల గృహాలు పూర్తవుతున్నాయి. గుండుగొలను జగనన్న కాలనీ 800 ఇళ్లతో ఓ ఊరుగా రూపుదిద్దుకుంటోంది. – పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే, ఉంగుటూరు

క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటుకు కృషి


క్రికెట్ పోటీలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న గారపాటి సీతారామాంజనేయ చౌదరి

పెదవేగి : మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహద పడతాయని, ఏలూరు పరిసర ప్రాంత క్రికెట్ ప్రేమికుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ఒక గ్రౌండ్‌ను తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయటానికి ప్రయత్నం చేస్తున్నట్లు వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. ఆదివారం పెదవేగి మండలం పినకడిమిలో తపన ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన పినకడమి ప్రీమియర్ లీగ్ (పీపీఎల్) క్రికెట్ ఫైనల్ రసవత్తరంగా సాగాయి. ఫైనల్ మ్యాచ్‌లో కమాండోస్ టీంపై, పినకడిమి టీం విజయం సాధించింది. విజేతలకు గారపాటి సీతారామాంజనేయ చౌదరి ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 26 టీములు ఈ పోటీల్లో పాల్గొన్నాయి.

విద్యుదాఘాతంతో తాపీమేస్త్రి మృతి

ఉంగుటూరు: తాపీ పని చేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో ఓ మేస్త్రి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఉంగుటూరు శివారులో ఓ కాలనీ ఆర్చి నిర్మాణ పనులు నిర్వహిస్తున్న తాపీ మేస్త్రి షేక్‌మహమద్ (20) ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆర్చి వద్ద పైనుంచి వెళ్లిన తీగలను తొలగించేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. అనుమతి రాగానే ఆ తీగలను మార్చాల్సి ఉంది. ఈలోపు తాపీమేస్త్రి పని చేస్తూ ఆ తీగలను తాకడంతో అక్కడికక్కడే మహమద్ చనిపోయాడు. మహమద్ తండ్రి మీరాసాహెబ్, తల్లి ఆశ, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ విషయంపై ఎస్సై స్వామిని ప్రశ్నించగా ఎటువంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు


భీమడోలులో కొవ్వొత్తులతో విశ్వాసుల ప్రదర్శన


దెందులూరు సాల్వేషన్ ఆర్మీ సమాధుల తోటల్లో పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

భీమడోలు: మండలంలో ఆదివారం పునరుత్థాన (ఈస్టర్) పండుగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు గుడ్‌ఫ్రైడే నాడు మృతి చెంది తిరిగి మూడోరోజు మృత్యుంజయునిగా తిరిగి లేచిన ఆదివారం రోజున ఈస్టర్‌ను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. క్రైస్తవులు సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, పోలసానిపల్లి, కోడూరుపాడు, లంక గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసారు. విద్యుద్దీపాలతో ఆలయాలను శోభాయమానంగా అలంకరించారు. మండలంలోని ఆర్‌సీఎం, సీఎస్ఐ, రక్షణసైన్యం, ఇతర సంఘాల ఆధ్వర్యంలో శనివారం ప్రార్థనలు చేసారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చి ఆవరణలో విచారణకర్త ఫాదర్ నెల్సన్ ఆధ్వర్యంలో విచారణ పరిధిలోని క్రైస్తవులంతా శనివారం అర్ధరాత్రి నుంచి ప్రతి ఒక్కరూ కొవ్వొత్తులతో దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసారు. ఏసుక్రీస్తు పునరుత్థానుడై అర్ధరాత్రి 12 గంటలకు లేచే రూపాన్ని చూపించారు. ఈస్టర్ పండుగ కేక్ కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ జోబి, రాజు, విన్సెంట్ డీపాల్ సొసైటీ సభ్యులు, పెద్దలు, కన్యస్త్రీలు, మరియ దళ సభ్యులు, జీవస్ యూత్, 10 గ్రామాల నుంచి వచ్చిన 2,500 మంది విశ్వాసులు పాల్గొన్నారు.

క్రైస్తవ దేవాలయాల్లో ఈస్టర్ వేడుకలు

పెదవేగి : సమాధిలో నుంచి మూడో రోజు ప్రభువైన క్రీస్తు మానవుని కోసం తిరిగి వచ్చారని నడి పల్లి విచారణ గురువు ఫాదర్ రాజు తెలిపారు. నడిపల్లి పవిత్ర త్రేత్వేక సర్వేశ్వర దేవాలయంలో ఈస్టర్ విశిష్టతను విచారణ గురువులు డి రాజు, రెక్టర్ ఫాదర్ చిట్టిబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో 9 గ్రామాల సంఘ విశ్వాసులు పాల్గొన్నారు. నడిపల్లి సంఘస్తులు, గొట్టేటి స్టాలిన్, యంత్రపాటి మహేష్, గాంలికి దానియేలు, యంత్రపాటి శ్రీను, తనగల రాంబాబు, వెంకట్రావు మాస్టారు, మోహన్ రావు మాస్టారు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు. పెదవేగి మండలం విజయరాయి పునీత అంథోని దేవాలయంలో విజయరాయి విచారణ గురువు దివాకర్‌రాజు ఆధ్వర్యంలో ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో ఫాదర్ దివాకర్, ఉపదేసులు, విజయరాయి, ముత్తనవీడు, రాయన్నపాలెం, రాట్నాలకుంట, చింతలపాటివారిగూడెం, కొండలరావుపాలెం గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రేమ, శాంతి, క్షమాపణ గుణాలు అలవర్చుకోవాలి

దెందులూరు: ప్రేమ, శాంతి, క్షమాపణ గుణాలు ప్రజలందరూ అలవర్చుకోవాలని ఏసుక్రీస్తు తన జీవితం, మరణం పునరుత్థానం ద్వారా రుజువు చేశారని దెందులూరు సాల్వేషన్ ఆర్మీ చర్చి కోర్ ఆఫీసర్ మేజర్ బోడా ఏసుదాసు అన్నారు. ఆదివారం గ్రామాల్లో ఈస్టర్ సందర్భంగా ప్రార్థనలు చేశారు. తెల్లవారుజామున అన్ని గ్రామాల్లో సాల్వేషన్ ఆర్మీ సమాధుల తోటల్లో పూర్వీకుల సమాధులను అలంకరించి ప్రార్థనలు చేశారు. అనంతరం సాల్వేషన్ ఆర్మీ, ఆర్‌సీఎం, మన్నా, ఐసీఎం, ఇతర స్వతంత్ర దేవాలయాల్లో క్రైస్తవుల పండుగ, ప్రార్థనలు నిర్వహించారు.

నేడు గుండుగొలనులో వాసుబాబు పర్యటన

భీమడోలు: గుండుగొలనులోని సచివాలయం 2 పరిధిలో ఈనెల 10వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, గుండుగొలను ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే వాసుబాబు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, వైసీపీ నాయకు లు, కార్యకర్తలు పాల్గొంటారన్నారు. గ్రామానికి రూ.3.5కోట్ల నిధులతో మంజూరైన 33 కేవీ సబ్ స్టేషన్ నిర్మా ణ పనులకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శంకు స్థాపనచేస్తారని తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

పెదపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003లో పదో తరగతి చదివిన తోటి విద్యార్థిని సురేఖకు స్నేహితులంతా కలిసి రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. పెదపాడు శివారు రామచంద్రపురానికి చెందిన సురేఖ కుమార్తె ఇటీవల మరణించడంతో ఆమె ఆర్థికంగా ఇబ్బందులు పడుతోందని తెలుసుకుని ఆదివారం ఆమె నివాసానికి వెళ్లి తమ వంతు సాయం అందించారు.

అల్లా బోధనలు అందరూ పాటించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : అల్లా బోధనలు అందరూ పాటిస్తూ రంజాన్ పండుగను ఎంతో సంతోషంగా జరుపుకోవాలని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ఏలూరు పట్టణ ముస్లిం మైనార్టీ మహిళల ఆధ్వర్యంలో ఆదివారం తంగెళ్ళమూడి దర్సెగాహ్–ఈ–ఇస్లామిక్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆవరణలో జరిగిన ఇఫ్తార్ కార్యక్రమంలో నూర్జహాన్ పెదబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం మైనార్టీ మహిళల ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా ఏటా రంజాన్ పండుగ నెల రోజులు దీక్షలు చేస్తూ అల్లా అనుగ్రహం పొందడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. అల్లా బోధనల ప్రకారం ప్రతి ఒక్కరూ తోటివారికి సహాయ పడాలని, క్రమశిక్షణతో నడుచుకోవాలని ఆమె సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను అందరూ ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని కోరారు. రంజాన్ పండుగ నెల రోజులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని, నగర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. కార్యక్రమంలో 48, 40 , 16వ డివిజన్ల కార్పొరేటర్లు నున్న స్వాతి కిషోర్, తుమరాడ స్రవంతి, జుజ్జవరపు విజయనిర్మల, కార్యక్రమం నిర్వాహకులు అన్సారి తదితరులు పాల్గొని ఇఫ్తార్ స్వీకరించారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

ఏలూరు రూరల్ : రానున్న ఎన్నికల్లో ప్రజలు మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే పట్టం కడతారని ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు నమ్మకాన్ని వెలిబుచ్చారు. ఏలూరు మండల కొక్కిరాయిలంకలో ఆయన పార్టీ నాయకులతో కలిసి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కొల్లేరు గ్రామాల్లో కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. మూడున్నరేళ్ల కాలంలో ప్రతి ఇంటికీ కుళాయి, ప్రతి ఊరుకి ఓవర్‌హెడ్ ట్యాంక్, కొత్త పైప్‌లైన్, వాడవాడల సీసీరోడ్లు అభివృద్ధి చేయడం వల్ల కొల్లేరు ప్రజలు అబ్బయ్య చౌదరిపై ఎంతో నమ్మకాన్ని పెంచుకున్నారని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలుకుతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే మరోసారి బ్రహ్మరథం పడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తేరా ఆనంద్, గుర్రం శివ, సర్పంచ్ తోకల అమల ఇంటింటికీ తిరిగి ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'


జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని

దెందులూరు: గ్రామగ్రామాన జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ఆదివారం వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని నాగులదేవునిపాడులో సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అభిప్రాయాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు పథకాలపై సంతృప్తి వ్యక్తం చేయడంతో జగనన్న స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. దోసపాడులో ఎంపీటీసీ పెద్దిశెట్టి రోహిణి, పార్టీ నాయకులు ఎస్.సుధాకర్, మారయ్య, మహేంద్ర, గృహసారథులు, వలంటీర్లు, పాల్గొన్నారు. శ్రీరామవరంలో పార్టీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. దెందులూరులో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు, మహిళా అధ్యక్షురాలు తొత్తడి వేదకుమారి, సచివాలయ మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతి రావు, ఎంపీటీసీలు తోట విజయకుమారి, పులిపాటి ఆనంద్, తాళ్లూరి నాగరాజు, గృహసారథులు, వలంటీర్లు సర్వే నిర్వహించారు. గోపన్నపాలెంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరంకి సత్యనారాయణ, సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి, ఉపసర్పంచ్ హేమసాగర్, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, గృహసారథులు, వలంటీర్లు, నాలుగేళ్ల పాలనపై సర్వే నిర్వహించారు. నాయకులు కొండేటి గంగాధరబాబు, తోట పద్మారావు, మోర్ల సుబ్బారావు తదితరులున్నారు. సానిగూడెంలో పార్టీ అధ్యక్షుడు ఫ్రాన్సిస్, సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు), పోతునూరు కేదవరం సర్పంచ్ బోదుల స్వరూప్, రేషన్ డీలర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ, బుద్ధా కృష్ణార్జున, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సర్వే నిర్వహించారు. ఎంపీటీసీ నరేష్, పార్టీ కార్యదర్శి రమేష్ ఉన్నారు. జోగన్నపాలెంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిట్టా గాంధీ, జడ్పీటీసీలు నిట్టా లీలానవకాంతం, సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సర్వే నిర్వహించారు.

సీఎం జగనన్న పరిపాలన బాగుంది

పెదపాడు: సీఎం జగనన్న పరిపాలన బాగుందని, మరలా ఆయనే ముఖ్యమంత్రి కావాలంటూ ఇంటింటికీ వెళ్తున్న గృహసారథులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఆదివారం మండలంలోని తోటగూడెం, అప్పనవీడు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్ కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతోపాటు గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపీచంద్ర దుర్గాప్రసాద్, మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, డివిజన్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ కత్తుల రవికుమార్, మాజీ సర్పంచ్ గరికపాటి పాండురంగారావు, సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, ఎంపీటీసీ బుద్ధే రామసీత, అభయాంజనేయస్వామి ఆలయకమిటీ చైర్మన్ నెర్సు నాగభూషణం, సూరపనేని బాల వెంకటరమణ, గరికపాటి సత్యన్నారాయణ పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా జగనన్నే మా భవిష్యత్తు

నిడమర్రు: వైఎస్సార్ సీపీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు మండలంలో మూడో రోజు ఉత్సాహంగా కొనసాగింది. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు సంయుక్తంగా ఆయా పరిధిలోని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు వివరించారు. పెదనిండ్రకొలనులో సర్పంచ్ చల్ల చాంబర్ జిల్లా ఉపాధ్యక్షుడు పుప్పాల మోహర్‌కుమార్, జెడ్పీటీసీ కోడే కాశి, మండల సచివాలయ కన్వీనర్ నాదు అమృతరావు సిద్దాపురంలో, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ బువ్వనపల్లిలో జేఎంబీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగనన్నకు జై కొట్టిన ప్రజలు

భీమడోలు: పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురంలో మా నమ్మకం నువ్వే జగన్ నిర్వహించారు ఆదివారం ఎంపీటీసీ గంటా శ్రీనివాస్, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. తొలుత వడ్డీలగూడెం సొంతలో ఎంపీటీసీ గంటా శ్రీనివాస్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్ మంగరా సీతారామయ్య, గృహ సారథులు భలే మురళీధర్, భలే సత్యవతి పాల్గొన్నారు.